పూర్వప్రాథమిక విద్యకు ప్రాధాన్యం

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్లు ప్రారంభించారు. రెండున్నరేళ్లు పూర్తయిన చిన్నారుల పేర్లను ఇంటింటికీ తిరుగుతూ నమోదు చేసుకుంటున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం నర్సరీ నుంచి ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రూ.వేలు ఖర్చు చేసి ప్రైవేట్ స్కూల్స్‌కు చిన్నారులను పంపించకుండా అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలన్నారు. గర్భిణులకు, బాలింతలకు, చంటి పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, తస్లీమా, వనజ, అన్నపూర్ణ, కళావతి, సావిత్రి, దీనమ్మ, ప్రసన్న, విక్టోరియా ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: పూర్వ ప్రాథమిక విద్య వల్ల చిన్నారులకు భవిష్యత్‌లో ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' అనే కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అభ్యసించిన చిన్నారులు భవిష్యత్‌లో ఉన్నత చదువులో రాణించగలుగుతారన్నారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు మొదటగా అంగన్‌వాడీ కేంద్రాలకు తమ పిల్లలను పంపించాలని టీచర్లు సుగుణాబాయి, ఎల్లమ్మ, మహేశ్వరి, సువర్ణ, కమల, చంద్రకళ, కృష్ణవేణి, మాధవి, పారిజాత అన్నారు.

పెబ్బేర్‌రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రంతో పాటు పెబ్బేర్ మున్సిపాలిటీలో మంగళవారం 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ పేర్కొన్నారు. రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులను పంపించడం ద్వారా వారికి ఆట పాటలతో కూడిన విద్య అందుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజులరాణి, కైసర్‌బేగం, శాంతబాయి, కవిత, రాధా, ఉమామహేశ్వరి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: 30 నెలలు దాటిన చిన్నారులందరూ అంగన్‌డీ కేంద్రాల్లో ఉండాలని సీడీపీఓ భారతి అన్నారు. 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్లతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 15 నుంచి 20 వరకు ఐదు రోజుల పాటు కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కాలనీలో ర్యాలీలను నిర్వహించడం, తల్లిదండ్రులతో సమావేశం, అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరిస్తు చిన్నారులకు అంగన్‌వాడీలో చేర్చుకునే ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ కవిత గ్రామస్తులు, మహిళా సంఘాల మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.


కొత్తకోటలో చిన్నారులతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


అమరచింత బీసీ కాలనీలో..


ఖిల్లాఘనపురంలో..


వీపనగండ్లలో..


శ్రీరంగాపూర్‌లో..

క్లుప్తంగా

ప్రభుత్వ స్థలం కాపాడండి



అమరచింత: పట్టణంలోని ఐదో వార్డులో ప్రభుత్వ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేసుకొని వాటిని ప్లాట్‌లుగా మార్చేందుకు పాల్పడుతున్నాడని, కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కాలనీకి చెందిన యువకులు మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి హరిజనవాడకు పరిమితమైన స్థలాన్ని కబ్జాచేసి అమ్ముకునే యత్నం చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిరుపేదల అవసరాల కోసం గతంలో కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కాలనీకి చెందిన కొంతమంది సహకారంతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, శ్యాం, ప్రకాశం, ఫిరోజ్, సూరి, సుభాష్, విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి నిధుల కేటాయింపుపై హర్షం



పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి స్థానిక కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములుయాదవ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా 30పడకల ఆస్పత్రి కోసం ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూశారని, వారి కలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విజయవర్ధన్‌రెడ్డి, సహదేవుడు, మన్నెం, ఆశన్ననాయుడు, కృపాకర్‌రెడ్డి, భరత్‌కుమార్, పబ్బా విజయ్‌వర్ధన్ గౌడ్, వెంకట్‌రెడ్డి, రాజురెడ్డి, రమేష్, జగదీశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

శాకాంబరిదేవిగా దర్శనం



ఆత్మకూర్: ఆషాడ మాసం సందర్భంగా స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అన్నిరకాల కూరగాయలతో శాకాంబరిగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు లక్ష పుష్పార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోరింటాకు మహోత్సవం నిర్వహించి మహిళలు ఆలయంలో చేతికి గోరింటాకు పెట్టుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు విజయలక్ష్మి, వీణ, శ్రీదేవి, అర్చన, వనజ, సంధ్య, సుధారాణి, పావని, అనురాధ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి

కొత్తకోట: మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో గడిచిన ఎనిమిది నెలల నుంచి ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదని, 11వ వార్డు బీజేపీ కౌన్సిలర్ భరత్‌భూషణ్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎస్ఎన్ సూర్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ఇంటి, నల్లాలు, షాపుల పన్నుల వసూళ్లపై ఉన్న ధ్యాస ఎందుకు లేదని, కొంతకాలంగా పాలక మండలి నిద్రావస్థలో ఉండిపోయిందని, కమిషనర్, కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని పట్టణ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

36 మంది అంగన్‌వాడీ టీచర్లకు మెమోలు

ఖిల్లాఘనపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న 36 మంది అంగన్‌వాడీ టీచర్లు, 25 మంది ఆయాలకు మెమోలు జారీ చేసినట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఈదమ్మ తెలిపారు. సోమవారం ఎలాంటి అనుమతులు లేకుండా అంగన్‌వాడీ కేంద్రాలను మూసి వేసి టీచర్లు, ఆయాలు జిల్లా కేంద్రంలో ధర్నాలకు వెళ్లడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆర్‌జేడీ మోతీ ఆదేశాల మేరకు అంగన్‌వాడీలకు మెమోలు జారీ చేశామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

వీపనగండ్ల: మతసామరస్యానికి మొహర్రం పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్ అన్నారు. మంగళవారం సంగినేనిపల్లిలో ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పీర్ల చావిడి వద్ద గ్రామస్తులకు అన్నదానం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మొహర్రం పండుగను కులమతాలకు అతీతంగా ప్రజలు చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో మీసాల మోహన్, కురుమయ్య, ఎండీ మైను, ఇంద్రకంటి కిష్టయ్య, నాగరాజు, రాముడు, సైదులు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



పెబ్బేర్‌రూరల్: పెబ్బేర్ మున్సిపాలిటీ పరిధిలోని 458 సర్వే నెంబర్‌లో ప్లాట్లు ఉన్న బాధితులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేస్తూ స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సర్వే నంబర్‌లో కనకదుర్గ, శ్రీనివాస వెంచర్లతో కలిసి మొత్తం 450 మంది ప్లాట్ల యజమానులు ఉన్నారు. కానీ హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు కబ్జాదారులు ఈ సర్వే నెంబర్‌తో పాటు ఇదే రెవెన్యూ పరిధిలో 545, 555 సర్వే నెంబర్లు కలుపుకొని మొత్తం 13 ఎకరాల 39 గుంటల భూమి మాఫీ ఇనాం అని వనపర్తి ఆర్డీఓకు అప్పీల్ వేశారు. ఈ విషయంలో ఆర్డీఓ స్థానిక రైతులతో గానీ, ప్లాటు యజమానులతో గానీ సమగ్ర విచారణ జరపకుండా తూతూ మంత్రంగా హియరింగ్ జరిపి హైదరాబాద్ వాసులకు ఈ భూమి చెందేవిధంగా హక్కు పత్రం అమలు చేసేవిధంగా స్థానిక తహసీల్దార్‌కు ఆదేశించారన్నారు. దీంతో ప్లాట్ల యజమానులు, రైతులు విచారణ జరపకుండా భూములను అప్పజెప్పడంపై తీవ్ర నిరసన తెలపుతూ ఇంప్లిమెంటేషన్ ఆపాలని, తమకు అన్యాయం జరగకుండా ప్లాట్లు, భూములు తమకే దక్కే విధంగా చూడాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌గౌడు, పరశురాముడు, మైబు, శివారెడ్డి, ఎల్లస్వామి, వెంకటేష్, నాగేశ్వర్‌రెడ్డి, నిజాముద్దీన్, వెంకట్‌రాములు, సర్వేష్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మట్టి మిద్దెలు


అమరచింత జగన్‌వాడలో కూలిన ఇల్లు


ఆత్మకూర్‌లో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్‌ఐ జయమ్మ

అమరచింత: పట్టణంలో కురుస్తున్న ముసురు వానలకు ఎనిమిదో వార్డులోని జగన్‌వాడలో మునిరా బేగం కు చెందిన మట్టి మిద్దె కూలిపోయింది. దీంతో ఇంట్లోని వస్తువులు మట్టిలో కలిసి పోయాయి. ఇంట్లో ఎవరూ రాత్రి వేళ నిద్రించడం లేదని, దీంతో ప్రాణహాని తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటిని మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

ఆత్మకూర్: మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆత్మకూర్‌లోని వినాయకనగర్‌లో గొల్ల చెన్నమ్మకు సంబంధించిన నివాస గృహం కూలిపోయింది. ఈమేరకు మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయమ్మ బృందం ఇంటిని సందర్శించి వివరాలు సేకరించారు. కాగా పాత నివాస గృహాల్లో ఉండకూడదని సురక్షితంగా ఉండేవిధంగా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ నరేందర్ అన్నారు. గ్రామాల్లో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వర్షాలతో నష్టపోకుండా చర్యలు చేపట్టాలి


మాట్లాడుతున్న శ్రీరామ్

పెబ్బేర్‌రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు నష్టపోకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులు, కుంటలు, సాగునీటి కాల్వలు దెబ్బతినకుండా కాపాడాలన్నారు. మిషన్ భగీరథ పనులు నాణ్యతగా చేపట్టలేదని ఆరోపించారు. పాన్‌గల్ మండలం కేతేపల్లిలోని గుండ్ల చెరువు తూములు సరిగా చేయలేదని, చెరువు కట్టలు, పంట, పాటు కాల్వలను వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. సాగునీటి కాల్వలలో పేరుకుపోయిన జమ్ము, మట్టిని వెంటనే తొలగించాలని కోరారు. పేదలకు ఇస్తామన్నా డబుల్‌బెడ్‌రూం ఇళ్లను వెంటనే మంజూరు చేసి వారిని ఆదుకోవాలన్నారు. వర్షకాలం సీజన్ కావడంతో పారిశుద్ధ్య చర్యలు, వాటర్ క్లోరినేషన్, తాగునీటి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, పట్టణ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఆరు, ఏడు వార్డుల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని ఆయా కాలనీల ప్రజలు సోమవారం రాస్తారోకో చేయడంతో.. వారి దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సవరమ్మ ఆలయ సమీపంలోని సోర్స్ బోర్ మరమ్మతుల కారణంగా, మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటి సరఫరాలో రెండు రోజుల పాటు అంతరాయం కలిగిందన్నారు. ప్రస్తుతం పట్టణంలోని ఏడు ఓవర్ హెడ్ ట్యాంక్‌లతో పాటు 16 సోర్స్ బోర్లతో నిత్యం ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామని వెల్లడించారు. మిషన్ భగీరథ లైన్‌మెన్లతో పాటు మున్సిపల్ వాటర్ లైన్‌మెన్ల సమన్వయ లోపం కారణంగా నీటి సరఫరాలో కొంత మేరకు ప్రజలకు ఇబ్బందులు కలిగిన విషయాలు తెలుసుకున్నామని, ఇకపై ఇలాంటి ఘటనలు జరుగకుండా ఇరు వాటర్ లైన్‌మెన్ల మధ్య అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌ఐ కృష్ణయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులను సంరక్షిస్తాం


నియామక పత్రాన్ని అందుకుంటున్న మౌనికయాదవ్

పాన్‌గల్: వినియోగదారుల ఫోరం జిల్లా చైర్‌పర్సన్‌గా మండలంలోని శాగాపూర్ గ్రామానికి చెందిన మౌనికయాదవ్‌ను నియమించారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షులు గోపిగౌడ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు చట్ట ప్రకారం ఉన్న హక్కులపై అవగాహన లేక చాలా మంది నష్టపోతున్నారని, వారి పక్షాన ఉంటూ పోరాటాలు కొనసాగిస్తామన్నారు. వినియోగదారులకు ఏ విధమైన ఇబ్బందులు ఉన్నా, నష్టం జరిగిన ఫోరంను ఆశ్రయించవచ్చన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి జిల్లా చైర్‌పర్సన్‌గా నియమించిన ఫోరం రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫోరం జిల్లా చైర్మన్ నియామకంపై గ్రామస్తులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పాన్‌గల్: ప్రతి వారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగకరమని ఏడీఏ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, యాజమాన్య పద్ధతులు, వరిలో స్వల్పకాలిక రకాలు, వర్షాకాలం పంటల్లో ఎరువుల వాడకం గురించి పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. అధికారుల సూచనల మేరకు ఎరువులు, విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సాజీద్ రహామాన్, పాన్‌గల్, చిన్నంబావి, వీపనగండ్ల మండలాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడని కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కనిమెట్టకు చెందిన కురటి శ్రీనివాసులు (28), భార్య వెన్నెలతో కలిసి కొంత కాలంగా కొత్తకోటలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. శ్రీనివాసులు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. వెన్నల ఇంట్లోనే ఉంటోంది. ఈనెల 12న శ్రీనివాసులు హైదరాబాద్‌కు వెళ్లి వస్తానని భార్య వెన్నెలకు చెప్పి వెళ్లాడు. నాటి నుంచి నేటి వరకు ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచాఫ్‌గా ఉండటంతో అనుమానం వచ్చి బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శ్రీనివాసులు అన్న కురటి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు పునరుద్ధరించండి

వీపనగండ్ల: తమ గ్రామానికి రాకపోకలు సాగిస్తున్న ఆర్టీసీ బస్సులను అధికారులు తొలగించారని, వెంటనే తమ గ్రామానికి బస్సు వసతిని కల్పించాలని గోపల్‌దిన్నె గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో వనపర్తి, కొల్లాపూర్ డిపో అధికారులు వనపర్తి, పెబ్బేరు పట్టణం నుంచి తమ గ్రామానికి బస్సులను నడిపేవారని, కరోనా సమయంలో బస్సులను నిలిపివేసిన అధికారులు నేటికీ పునరుద్ధరించలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమ గ్రామానికి బస్సులను పునరుద్ధరించాలని వారు కోరారు.

ఈ నెల 19న వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

కొత్తకోట రూరల్: అమడబాకులలో గల స్వయంభూ కల్యాణ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో అఖండ జ్యోతిని స్థాపించి 21ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న మండలంలోని విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పాటల పోటీలను స్థానిక గ్రంథాలయం వద్ద బుధవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల 30 నిమిషాల వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువు, గ్రంథాలయం ప్రాముఖ్యత, స్వయంభు కల్యాణ లక్ష్మీవేంకటేశ్వరస్వామి అమడబాకుల వారి స్థల చరిత్ర వంటి అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతిగా రూ.3వేలు, మూడో బహుమతిగా రూ.2వేలు, అదేవిధంగా ఉపన్యాస, పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.3వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి నగదును అందజేస్తామన్నారు. అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని పోటీల్లో పాల్గొని కోరారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ఖిల్లాఘనపురం: బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన బుచ్చిబాబుగౌడు నియమించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఖిల్లాఘనపురం మండల అధ్యక్షుడిగా బుచ్చిబాబును ఎంపిక చేసి నియామక పత్రాన్ని అందజేశారు. ఇప్పటి వరకు మండల అధ్యక్షుడిగా సోళీపురం గ్రామానికి చెందిన నవీన్‌రెడ్డి పనిచేశారు. నూతన అధ్యక్షుడిగా ఎంపికైన బుచ్చిబాబుగౌడు గతంలో మండల అధ్యక్షుడిగా పనిచేయడంతో పాటుగా జిల్లా కమిటీలోనూ అధికార ప్రతినిధిగా పని చేశారు. ఈ సందర్భంగా బుచ్చిబాబుగౌడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసిన, అందుకు కృషి చేసిన జిల్లా అధ్యక్షుడికి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీశైలం, రామన్‌గౌడు, శ్రీనివాస్‌గౌడ్, మధు, బాశెట్టి శ్రీనివాసులు, కుమారస్వామి, కృష్ణగౌడు, ఆశన్న, రాంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, యువమోర్చా మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, తులసీకుమార్, బెస్తరాజు, తిర్మలాయపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.



సరళాసాగర్ ఆయకట్టుకు నీరు వదలాలి


మట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్

మదనాపురం: సరళాసాగర్ ఆయకట్టు కింద ఈ ఖరీఫ్ పంటలకు సత్వరమే నీటిని విడుదల చేయాలని, లేకుంటే ఈ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని జెడ్పీటీసీ మాజీ కృష్ణయ్యయాదవ్ అన్నారు. మండలంలోని సరళసాగర్ ప్రాజెక్టులో మంగళవారం నీటిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సకాలంలో పంట పొలాలకు నీళ్లు వదలాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటిని నింపేందుకు ప్రయత్నించాలన్నారు. ఇప్పటికే నారుమడులు పోసుకున్న రైతులు నీళ్లు వస్తాయో.. రావో అని ఆందోళనలో ఉన్నారని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా సత్వరమే స్పందించి సరళాసాగర్ ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్టి యాదగిరి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కొత్తపల్లి మాసన్న, రవి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తం


డ్రమ్ములోని నిల్వ నీటిని పారబోస్తున్న సిబ్బంది


మనిగిళ్లలో డెంగీ వ్యాధిగ్రస్తుడి ఇంట్లో పిచికారీ చేయిస్తున్న డీఎంఓ శ్రీనివాస్‌జీ

కొత్తకోట రూరల్: వర్షాకాలంలో సీజన్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ డిప్యూటీ అధికారి శ్రీనివాస్‌జీ అన్నారు. మంగళవారం పెద్దమందడి మండలంలోని మనిగిళ్లలో డెంగీ వ్యాధి పాజిటివ్ కేసు ఇంటిని డీఎంఓ, సిబ్బందితో కలిసి సందర్శించారు. పీహెచ్‌సీలో ఇచ్చిన శాంపిల్స్ ఆధారంగా మనిగిళ్లలో ఓ వ్యక్తికి మలేరియా వచ్చినట్లు గుర్తించి అతడి ఇంటిని వైద్య సిబ్బంది సందర్శించి, పైరేత్రాన్ని పిచికారీ చేయించినట్లు డీఎంఓ తెలిపారు. అంతే కాకుండా వ్యాధి గుర్తించిన వ్యక్తి ఇంటి చుట్టు గల 50ఇళ్లను సందర్శించి తగు జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. సీజన్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వచ్చినట్టు అనిపిస్తే వెంటనే వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సూపర్‌వైజర్ ఓంప్రకాష్, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాల్వను పునరుద్ధరించకుంటే కేసు నమోదు చేయిస్తాం


ఏఈతో వాగ్వాదం చేస్తున్న రైతులు

పాన్‌గల్: పూడ్చిన సాగునీటి కాల్వను పునరుద్ధరించకుంటే సంబంధిత రైతుపై కేసు నమోదు చేయిస్తామని ఇరిగేషన్ ఏఈ వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా సమీపంలో కేఎల్‌ఐ డీ1 కాల్వను పూడ్చి వేసి గిరిజన రైతులకు ఇబ్బందులు కలిగించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిశీలించినట్లు ఏఈ పేర్కొన్నారు. రైతులకు సాగునీరు అందించే కాల్వను తెల్లరాళ్లపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పూడ్చి వేసి ఆయకట్టు రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారనే అంశంపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించినట్లు ఆయన పేర్కొన్నారు. కాల్వలో పూడ్చిన మట్టిని తొలగించి సాగునీరు సాఫీగా ప్రవహించేలా చూడాలని, లేనిచో కేసు నమోదు చేయిస్తామని చెప్పినట్లు ఏఈ తెలిపారు. పరిశీలనకు వచ్చిన ఏఈతో గిరిజన రైతులు, నాయకులు కాల్వను పూడ్చి ఇన్ని రోజులైనా సమస్యను పరిష్కరించడం లేదని వాగ్వివాదానికి దిగారు.